క్లుప్తంగా

స్పందనకు 19 అర్జీలు

కనిగిరి రూరల్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనకు 19 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కనిగిరి మండలం నుంచి 11, పామూరు 1, కేకే మిట్ల 1, పొదిలి 1, హెచ్ఎంపాడు 5 అర్జీలను ఆర్డీఓ తోట అజయ్‌కుమార్‌కు స్పందనలో అందచేసినట్లు డీఏఓ బసిరెడ్డి జయవర్ధన్‌రెడ్డి తెలిపారు. వాటిని పరిశీలించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ పేర్కొన్నారు.

ఈకేవైసీ తప్పకుండా చేయాలి


మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ కృష్ణారావు

హనుమంతునిపాడు: ప్రభుత్వ సంక్షేమ పథకాల ఈకేవైసీ చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ జీవీ క్రిష్ణారావు అన్నారు. సచివాలయాల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్లతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ విద్యా దీవెన, జగనన్న తోడు, ఈబీసీ నేస్తం, జగనన్న చేదోడు సంక్షేమ పథకాలు ఈకేవైసీ చేయాలన్నారు. ఈఓఆర్డీ షేక్ షరీఫ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆదాయం రూ.1.81 లక్షలు

సీఎస్‌పురం (పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం వరకు రూ.1,81,783 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ నర్రా నారాయణరెడ్డి సోమవారం తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.72,560, లడ్డుప్రసాదాల అమ్మకం ద్వారా రూ..30,220, ఆలయం వద్ద నిర్మిస్తున్న మహాప్రాకార నిర్మాణానికి విరాళంగా రూ.12,348, ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ..61,139, ఇతర విరాళాల ద్వారా రూ.5,516 వచ్చినట్లు ఈఓ తెలిపారు.

ఉల్లాసంగా ఆటల పోటీలు


కబడ్డీలో తలపడుతున్న బాలికలు

హనుమంతునిపాడు: స్వాతంత్ర్య వేడులను పురస్కరించుకొని పాఠశాలల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్, క్విజ్, వ్యాచరచన, హైజంప్, లాంగ్‌జంప్, స్కిప్పింగ్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు స్వాతంత్ర దినోత్సవంనాడు బహుమతుఅందజేస్తామని హెచ్ఎం జీవీ సురేష్‌బాబు, పీడీ అరుణ తెలిపారు.

పాఠశాలకు క్రీడా వస్తువుల అందజేత


దాతలు అందించిన క్రీడా వస్తువులు

హనుమంతునిపాడు: మండలంలోని సీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎన్ఆర్ఐ గంటా శ్రీనివాసులరెడ్డి రూ. 20 వేల విలువైన క్రీడా సామాగ్రి అందజేయడం అభినందనీయమని హెచ్ఎం పద్మావతి అన్నారు. పీడీ షేక్ జిలానీ, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ సానికొమ్ము వెంటేశ్వరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మారంరెడ్డి రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అందుబాటులో యంత్ర పరికరాలు

పీసీపల్లి: మండలంలో వైఎస్సార్ యంత్ర పరికరాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయాధికారి వెంకటస్వామి తెలిపారు. మండలానికి దాదాపు రూ.48 లక్షల మేర సబ్సిడీతో రూ.1.51 కోట్ల విలువైన యంత్రాలు రైతులకు అందించామన్నారు. మండలంలోని 13 ఆర్బీకే కేంద్రాల్లో ఉన్న వీఏఏ లు, వీహెచ్ఏలను కలిసి అర్జీలు దాఖలు చేసుకున్న ప్రతి రైతు సమాఖ్య గ్రూపులకు ఈ యంత్రాలను అందజేస్తామని తెలిపారు. అలాగే ఈ యంత్రా సేవా పథకం కింద గ్రూపు కన్వీనర్, కో కన్వీనర్‌లు అవసరమైన రైతులను ఈ యంత్రాలను అద్దెకిస్తారని తెలిపారు. వైఎస్సార్ యంత్రా సేవా పథకం వివరాలను అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు.

భక్తిశ్రద్ధలతో అంకమ్మతల్లికి పొంగళ్లు

గుడ్లూరు: స్థానిక మిట్టపాలెం అంకమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా చివరి రోజు సోమవారం అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పొంగళ్లు సమర్పించారు. గ్రామంలోని మహిళలు ఇళ్ల వద్ద పొంగళ్లు పెట్టుకొని మేళతాళాలతో ఊరేగింపుగా అంకమ్మ తల్లి ఆలయం వద్దకు తీసుకొని వచ్చారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. సోమవారంతో అంకమ్మతల్లి తిరునాళ్ల ప్రశాంతంగా ముగిసినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

స్వాతంత్య్ర సమరయోధులను స్మరించుకోవాలి


టంగుటూరులో ప్రతిజ్ఞ చేస్తున్న వరికూటి అశోక్‌బాబు


వేములపాడులో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు నాయకులు


మోపాడులో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ, జెడ్పీటీసీ, నాయకులు


కనిగిరి: మట్టితో ప్రతిజ్ఞ చేస్తున్న జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి, నాయకులు

హనుమంతునిపాడు: దేశం కోసం పోరాటం చేసిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాలని ఇన్‌ఛార్జి ఎంపీడీఓ కృష్ణారావు అన్నారు. నా భూమి నాదేశం హర్ ఘర్ తిరంగా వీరులకు వందన కార్యక్రమం సోమవారం హనుమంతునిపాడు, దాసరిపల్లి, కొండారెడ్డిపల్లి, వేములపాడు, దొడ్డిచింతల, మిట్టపాలెం గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా మట్టిపై ప్రతిజ్ఞ చేశారు. మన జాతీయ జెండాను ఆవిష్కరించారు. జెండా వందనం చేశారు. దాసరిపల్లిలో గ్రామ సర్పంచ్ భవనం క్రిష్టారెడ్డి, కొండారెడ్డిపల్లిలో సర్పంచ్ కలుకూరి దేవకరుణమ్మ, వేములపాడులో మండల రైతు సంఘ అధ్యక్షుడు శ్యామల సాంబిరెడ్డి, హనుమంతునిపాడులో ఎంపీటీసీ ఉడుముల సుబ్బారెడి, హెచ్ఎం జీవి సురేస్‌బాబు, దొడ్డిచింతలో సర్పంచ్ సానికొమ్ము బ్రహ్మారెడ్డి, మిట్టపాలెంలో సర్పంచ్ సుబ్బరాయుడు, ఏపీఓ వెంకటేశ్వర్లు మొక్కలు నాటారు. గ్రామసర్పంచ్, యూత్ అధ్యక్షుడు భవనం క్రిష్టారెడ్డి, ఈఓఆర్డీ షేక్ షరీఫ్ ప్రచార కమిటీ అధ్యక్షుడు డి.పిచ్చిరెడ్డి, రైతు సంఘ మండల అధ్యక్షులు శ్యామల సాంబిరెడ్డి, ఏపీఓ వెంకటేశ్వర్లు, సీసీలు వెంకట్రావు, శ్రీను, కార్యదర్శులు శ్రావణ సంధ్యా, బ్రహ్మాచారి, ఉపసర్పంచ్ కత్తి కిరణ్ పాల్గొన్నారు.

సీఎస్‌పురం (పామూరు): ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా హర్ ఘర్ తిరంగా, నామట్టి నాభూమి కార్యక్రమాలు ప్రతి ఒక్కరి మదినిండా దేశభక్తిని నింపాయని ఏపీఓ వాక్యవతి అన్నారు. మండలంలోని ఉప్పలపాడు, కంభంపాడు, ఏకునాంపురం, వెంగనగుంటతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో వసుధకు వందనం, హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటారు. కంభంపాడు సర్పంచ్ మర్రి రామయ్య, వేల్పుల నారాయణయాదవ్, సర్పంచ్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పామూరు: మొక్కలు నాటి వాటిని సంరక్షించి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, ఎంపీడీఓ ఊట్ల శ్రీనివాసులు అన్నారు. మండలంలోని మోపాడు, తూర్పు కట్టకిందపల్లె, బుక్కాపురం, రావిగుంటపల్లె, తూర్పు కోడిగుడ్లపాడుతో పాటు పలు గ్రామాల్లో సోమవారం ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జాతీయ జెండాకు వందనం చేసి, పాఠశాల ప్రాంగణంలో మొక్కలునాటి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏపీఓ మాల్యాద్రి, దారపనేని రాజా, పీఎస్.క్రిష్ణమూర్తి, అంబవరపు లక్ష్మినారాయణ, సీసీ దానియేలు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: మాతృభూమి కోసం, దేశం కోసం త్యాగం చేసిన మహనీయులకు, త్యాగధనులకు ప్రతి ఒక్కరూ రుణపడి ఉండాలని జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మండలంలోని చల్లగిరిగిల్ల, బడుగులేరు గ్రామాల్లో శుక్రవారం నా భూమి నాదేశం, నేల తల్లికి నమస్కారం వీరులకు వందనం కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా నేల తల్లికి పూజలు నిర్వహించి, గ్రామాల్లో మొక్కలు నాటారు. సర్పంచ్ స్వర్ణ కుమార్, ఎంపీటీసీ అల్లు నర్సమ్మ, పచ్చవ వెంకట సుబ్బయ్య, ఆదిరెడ్డి, ఏపీఓ షారోన్, రమేష్‌రెడ్డి, గోడి నారాయణరెడ్డి, సంగటి మహేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక నాయకులు జెడ్పీటీసీ ఎం కస్తూరిరెడ్డిని ఘనంగా సన్మానించారు.

వెలిగండ్ల: దేశం కోసం పోరాటం చేసి వీర మరణం పొందినవారితో పాటు సమరయోధులను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలని ఎంపీడీఓ టి.సుకుమార్ అన్నారు. మండలంలోని చౌడవరం, మరపగుంట్ల, రామగోపాలపురం, జాళ్లపాలెం, పి.నాగులవరం గ్రామాల్లో నా భూమి నాదేశం కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ర్యాలీ నిర్వహించారు. శిలాఫలకం వద్ద ప్రతిజ్ఞ చేశారు. మొక్కలు నాటారు. జెండా వందనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ టి.సుకుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్య వీరులకు వందనం సమర్పించడం ఎంతో పుణ్యమన్నారు. మిలటరీలో పనిచేస్తూ చనిపోయిన పి. నాగులవరానికి చెందిన పాపాబత్తుని చిననాగయ్య స్మరిస్తూ ఆయన భార్య రోశమ్మను సన్మానించారు. వైఎస్సార్ సీపీ నాయకులు యెలికె నారాయణ, ఉపాధి హామీ సిబ్బంది మనోహర్, జోయల్‌రాజు, ఆదినారాయణ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

● వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు

టంగుటూరు: స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను నిత్యం స్మరించుకోవాల్సిన అవసరం ఉందని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నా భూమి–నా దేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరికూటి మాట్లాడుతూ.. ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితమే స్వాతంత్ర్యమన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో మొక్కలు నాటారు. టంగుటూరుకు చెందిన మాజీ సైనికుడు బండ్లమూడి కృష్ణయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రత్నజ్యోతి, ఈఓఆర్డీ నర్రా జగదీషుబాబు, ఏపీఓ సభాషిణి, రావినూతల మనోహర్, ఎంపీపీ పటాపంజుల కోటేశ్వరమ్మ, రాష్ట్ర ఎంబీసీ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, మాజీ మండల అధ్యక్షుడు మల్లవరపు రాఘవరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు కొమ్ము సురేంద్ర, టంగుటూరి రామకృష్ణ, ఎంపీటీసీలు కొమ్ము ప్రభుదాసు, బొడ్డు వాసంతి తదితరులు పాల్గొన్నారు.

మర్రిపూడి: మండలంలోని గుండ్లసముద్రంలో నా భూమి–నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షులు, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మట్టిపై ప్రతిజ్ఞ చేశారు. సచివాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఎంపీడీఓ బ్రహ్మయ్య, సర్పంచ్ గురిజాల మరియబాబు, ఇనుకొల్లు మాదిరెడ్డి, ఇనుకొల్లు సుబ్బారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొండపి: మండలంలోని కె.ఉప్పలపాడులో నా భూమి–నాదేశం పైలాన్ వద్ద గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది, ప్రజాప్రతినిధులతో కలిసి వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి డాకా పిచ్చిరెడ్డి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ దయామణి, కార్యదర్శి రత్నప్రభ, హెచ్ఎం వి.సుసన్నకుమార్, పీఎంసీ చైర్మన్ రాఘవేంద్రశర్మ, టీఏ నరసింహరావు, ఎఫ్ఏ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జరుగుమల్లి: స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన వారిని స్మరించుకోవడం మన అందరి బాధ్యతని పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ ఆర్.శశిధర్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన జరుగుమల్లిలో నాభూమి–నా దేశం కార్య క్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అమర వీరుల జ్ఞాపకంగా నిర్మించిన స్థూపాన్ని ఆవిష్కరించారు. జరుగుమల్లికి చెందిన మాజీ సైనికులు మేడికొండ రామయ్య దంపతులను డ్వామా పీడీ శీనారెడ్డితో కలిసి సన్మానించారు. అనంతరం జెండా వందనం చేసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీడీ వెంకటస్వామి, ఎంపీడీఓ కె.జలజాక్షి, ఏపీఎం ఎం.భాగ్యలక్ష్మి, ఏపీఓ కొక్కిలిగడ్డ నాగరాజు, జరుగుమల్లి నాయకులు దుంపా అనిల్‌కమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పులి భిక్షాలు, సర్పంచి కసుకుర్తి పున్నారావు తదితరులు పాల్గొన్నారు.

సింగరాయకొండ: స్థానిక బుంగబావి చెరువు దగ్గర నా భూమి–నా దేశం కార్యక్రమం నిర్వహించారు.ఎంపిడిఓ షేక్ జమీఉల్లా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు. అనంతరం మట్టిపై ప్రతిజ్ఞ చేసి, జాతీయ జెండాను ఆవిష్కరించి మొక్కలు నాటారు. సర్పంచ్ తాటిపర్తి వనజ, ఏపీఓ సిహెచ్ సుధాకరరావు, ఫీల్డ్ అసిస్టెంట్ కొండలరావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గుడ్లూరు: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన అమర వీరుల త్యాగాలను ఎన్నటికీ మరువలేమని, వారికి రుణపడి ఉంటామని ఎంఎస్ఆర్ఈజీఎస్ డిప్యూటీ కమిషనర్ శశిధర్‌రెడ్డి అన్నారు. ఆజాదికా అమృత మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నా భూమి నాదేశం,నేల తల్లికి వందనం కార్యక్రమంను సోమవారం నిర్వహించారు. అమరవీరుల త్యాగాలకు గుర్తుగా వైద్యశాల ఆవరణలో మొక్కలు నాటి శిలాఫలకంను ఆయన ఆవిష్కరించిన అనంతరం అధికారులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేశారు. ఏపీడీ సంజీవరావు, ఎంపీపీ రమేష్, ఎంపీడీఓ చంద్రసేన్, సర్పంచ్‌లు శంకర్, సుబ్బరాజు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: మండలంలోని నలదలపూర్, కొండసముద్రం, శింగమనేనిపల్లి, లింగపాలెం, కాకుటూరు పంచాయతీల్లో ఆజాది కా అమృత్ మహోత్సవ్ వేడుకలు నిర్వహించారు. పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం శిలాఫలకాలు ఏర్పాటు చేసి పంచాయతీ కార్యాలయాల్లో మొక్కలు నాటారు. ఎంపీడీఓ రఫీక్‌అహ్మద్, ఏపీడీఓ సంజీవ్‌రావు, ఏపీఓ ఉమామమేష్ పాల్గొన్నారు.

కందుకూరు రూరల్: నేలతల్లిని పరిరక్షించుకుందామని రాష్ట్ర రూరల్ డెవలప్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ ఆర్.శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా నాభూమి–నాదేశం నేలతల్లికి నమస్కారం–వీరులకు వందనం కార్యక్రమాన్ని మండలంలోని మహదేవపురం సచివాలయం వద్ద ఆయన పాల్గొని ప్రారంభించారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన వీరులను స్మరించుకోవాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఏపీడీ సంజీవరావు, ఏపీఓ ఎల్.సుజాత, ఈసీ విజయ్‌కుమార్, సర్పంచ్ పద్మ, ఓగూరు సర్పంచ్ వై.కొండమ్మ, సచివాలయ సిబ్బంది, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.


గుండ్లసముద్రంలో మొక్క నాటుతున్న ఎంపీపీ వెంకటరెడ్డి


జరుగుమల్లిలో మాజీ సైనికుడు రామయ్య దంపతులను సత్కరిస్తున్న అధికారులు


కందుకూరు రూరల్‌లో మొక్కలు నాటుతున్న పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ శశిధర్‌రెడ్డి

ముగిసిన నామినేషన్ల పర్వం

పీసీపల్లి: మండలంలో ఖాళీగా ఉన్న పెదయిర్లపాడు, పెదఅలవలపాడు, గుంటుపల్లి పంచాయతీల వార్డులకు నామినేషన్ల ఉపసంహరణ పర్వం ముగించింది. సోమవారం నాటికి పెదఅలవలపాడులో 1వ వార్డు, పెదయిర్లపాడులో నాల్గవ వార్డుకు దాఖలైన నామినేషన్లలో 2నామినేషన్లు ఉపసంహరించుకోగా రెండు వార్డులు ఏకగ్రీవమయ్యాయి. అలాగే గుంటుపల్లి 3వ వార్డుకు ముగ్గురు నామినేషన్లు ఉపసంహరించుకోగా ముగ్గురు బరిలో నిలిచారు. ఈ వార్డు 19న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహించి అదే రోజు కౌంటింగ్ నిర్వహిస్తామని ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

పామూరు: మండలంలోని తూర్పు కట్టకిందపల్లె గ్రామ పంచాయతీ 3వ వార్డు ఉప ఎన్నికకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణరోజు సోమవారం గడువు ముగిసే సమయానికి కేవలం ఒక్క నామినేషన్‌దారురాలే బరిలో ఉండటంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు స్టేజ్–1 ఎన్నికల అధికారి కంచం రాధ తెలిపారు. సోమవారం వార్డు సభ్యురాలిగా ఏకగ్రీవంగా ఎన్నికైన పూల రమణమ్మకు ధ్రువీకరణపత్రాన్ని అందజేసినట్లు ఆమె తెలిపారు. మండలంలోని మోపాడు పంచాయతీకి సంబంధించి 6వ వార్డుకు గడువు ముగిసే సమయానికి ఒక్క నామినేషన్‌కూడా దాఖలు చేయలేదు. అయితే గతంలో అదేవార్డులో వార్డు సభ్యులుగా గడిచిన రెండు విడతల్లో పోటీచేసిన యర్రబోయిన వెంగళరెడ్డి, జిల్లెళ్ల ప్రసాదు, కామిరెడ్డి శ్రీనివాసులురెడ్డి పలుకారణాలతో మృతిచెందడంతో సెంటిమెంట్‌గా నామినేషన్ వేసేందుకు ముందుకు రావడం లేదని సమాచారం.

సీఎస్‌పురం (పామూరు): మండలంలో ఖాళీగా ఉన్న 3 గ్రామ పంచాయతీ వార్డులకు సంబంధించి నామినేషన్ ఉపసంహరణ ప్రక్రియ సోమవారం సాయంత్రంతో ముగియగా రెండు వార్డులు ఏకగ్రీవం కాగా మరో వార్డులో 5 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని ఎంపీడీఓ ఈశ్వరమ్మ తెలిపారు. ఏకగ్రీవమైన వార్డులు కోవిలంపాడు 2వ వార్డుకు రాచపూడి పరిమళ, వెంగనగుంట 6వ వార్డుకు ఉప్పుటూరి మాల్యాద్రిలు ఏకగ్రీవం కాగా, చెన్నపునాయునిపల్లి 6వ వార్డుకు తోడేటి రఘురాములు, నారిశెట్టి వెంకటయ్య, యనమల వెంకట నాగరాజు, షేక్.గౌస్, షేక్.నాయబ్‌రసూల్ బరిలో ఉన్నట్లు ఈనెల 19వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

లింగసముద్రం: మండలంలోని విశ్వనాథపురం పంచాయతీలోని 6వ వార్డుకు ఏకగ్రీవం అయినట్లు ఎంపీడీఓ శేషుబాబు తెలిపారు. వార్డుకు ఆత్మకూరి కోటేశ్వరమ్మ ఒక్కరే నామినషన్ వేయడంతో ఏకగ్రీవం అయినట్లు పేర్కొన్నారు.

పాకల సర్పంచ్ బరిలో ఐదుగురు అభ్యర్థులు

సింగరాయకొండ/కొండపి/టంగుటూరు: పాకల సర్పంచ్ ఉప ఎన్నికకు ఐదుగురు అభ్యర్థులు, సింగరాయకొండ పంచాయతీలో 16వ వార్డుకు ఇద్దరు, మూలగుంటపాడు పంచాయతీలో 10వ వార్డుకు ముగ్గురు అభ్యర్థులు బరిలో నిలిచారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం వైఎస్సార్ సీపీ మద్దతుదారు కుర్రి ప్రసన్నకుమార్, టీడీపీ మద్దతుదారులు చెంచంగారి ముత్యాలు, సైకం చంద్రశేఖర్, జనసేన, బీఎస్పీ అభ్యర్థులు ఒకరు చొప్పున బరిలో ఉన్నట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.

కొండపిలో వార్డు మెంబర్లు ఏకగ్రీవం

➤ కొండపి మండలంలోని కె.ఉప్పలపాడు 10వ వార్డు, చినకండ్లగుంట 4వ వార్డు, పెదకండ్లగుంట 10వ వార్డుకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో అన్నీ ఏకగ్రీవమైనట్లు స్టేజ్–1 అధికారులు సురేఖ, రామారావు, రసూల్ వెల్లడించారు.

➤ టంగుటూరు మండలం కందులూరు 2వ వార్డు, వాసేపల్లి 2వ వార్డు ఉప ఎన్నిక ఏకగ్రీవమైంది. పొందూరు 1వ వార్డుకు 8 నామినేషన్లు దాఖలవగా సోమవారం ఆరుగురు ఉపసంహరించుకున్నారు. దీంతో ఇద్దరు అభ్యర్థులు బరిలో నిలిచారు.

ఎస్టీల సమస్యలు పరిష్కరిస్తా


నరసింహనగర్ కాలనీ వాసులతో మాట్లాడుతున్న అశోక్‌బాబు

● వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు

సింగరాయకొండ: ఎస్టీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. పాత సింగరాయకొండ పంచాయతీలోని నరసింహ కాలనీలో సోమవారం ఉదయం రచ్చబండ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఎస్టీల శ్మశానికి కాలిబాట ఏర్పాటు చేయాలని, కమ్యూనిటీ హాలు నిర్మించాలని సర్పంచ్ వల్లూరి రాజ్యలక్ష్మి విజ్ఞప్తి చేయగా సానుకూలంగా స్పందించారు. గాలి బుజ్జి, సాయికోటి, చిమట సుధాకర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలకు అనుగుణంగా పనిచేయాలి


అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఈఓ

పామూరు: అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ఆలయ నిర్వహణ, పూజాది కార్యక్రమాల నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలని శ్రీమదన వేణుగోపాల స్వామి, వల్లీ భుజంగేశ్వరస్వామి ఆలయాల నూతన ఈఓ నర్రా నారాయణరెడ్డి అన్నారు. ఇటీవల ఈఓగా బాధ్యతలు చేపట్టిన ఆయన సోమవారం మదనవేణుగోపాలస్వామి, వల్లీ భుజంగేశ్వరస్వామి ఆలయాలను సందర్శించారు. ఈసందర్భంగా మదన వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ చైర్మన్ గుర్రం వెంకటేశ్వర్లు, కమిటీ పశుపు టేటి రఘురాంలు ఆలయాల నిర్వహణ సమయాలు, వసతులపై పలువిషయాలు ఈఓ దృష్టికి తేగా ఆయన అర్చకులు, కమిటీ సభ్యులు ఐక్యంగా ఉండాలని, వివాదాలు వద్దని సూచించారు. అర్చకులు నారాయణం సత్యబాబు, మహంకాళి శివప్రసాద్, తిరుపతయ్య, పిక్కిలి మస్తానయ్య ఉన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


నాడు-నేడు పనులు పరిశీలిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: నాడు–నేడు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 10వ వార్డు ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను సోమవారం చైర్మన్ అబ్దుల్ గఫార్, కౌన్సిలర్ దాసరి మురళీలు పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలల కంటే దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన, మెరుగైన విద్య లభిస్తోందని తెలిపారు. హెచ్ఎం రాజశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు దాసరి మురళీ కృష్ణా, సయ్యద్ రిజ్వానా ఖాలక్, కన్వీనర్లు ఎస్ఎస్ రసూల్, పెద్దన్న ఎల్ఐసీ నారాయణ, సచివాలయ శానిటరీ సెక్రటరీ నాగలక్ష్మి, స్థానిక నాయకులు పాల్గొన్నారు. తొలుత విజయవాడలో కంటి శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటికి వచ్చిన పఠాన్ అయుబ్ ఖాన్ తమ్ముడు మహబూబ్ ఖాన్‌ను మున్సిపల్ చైర్మన్ గఫార్, కౌన్సిలర్లు పరామర్శించారు. మహబూబ్‌ఖాన్‌కు ఆరోగ్య జాగ్రత్తలు, సూచనలిచ్చారు.

ఓటరు సర్వే నూరు శాతం పూర్తి చేయాలి


ఓటరు సర్వేపై బీఎల్‌ఓలతో సమీక్షిస్తున్న ఈఆర్ఓ నారదముని

సింగరాయకొండ: మండలంలోని ప్రతి బీఎల్ఓ నూరు శాతం ఓటరు సర్వే చేయాలని డిప్యూటీ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నారదముని ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం సాయంత్రం బీఎల్ఓలతో ఓటరు సర్వేపై సమీక్ష నిర్వహించారు. డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ.. మండలంలో 75 శాతం ఓటరు సర్వే పూర్తయిందని, నాలుగు రోజుల్లో నూరు శాతం చేయాలని స్పష్టం చేశారు. సర్వే సక్రమంగా చేయని బీఎల్ఓలు, సూపర్‌వైజర్లతో ప్రత్యేకంగా మాట్లాడి సూచనలిచ్చారు. తహసీల్దార్ సీహెచ్ ఉష, డిప్యూటీ తహసీల్దార్ తస్లీరు వెంకటేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ శివ, సీనియర్ అసిస్టెంట్ టి.తిరుమలరావు, వీఆర్ఓలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాయితీపై స్థలాలివ్వాలి

కనిగిరి రూరల్: చేతి వృత్తులతో జీవనం సాగిస్తున్న విశ్వ బ్రహ్మణులకు ప్రభుత్వం రాయితీతో కూడిన స్థలాలు, మిషనరీలు అందచేయాలని విశ్వ బ్రహ్మణ సంఘ జిల్లా అధ్యక్షుడు చెన్ను పల్లి శ్రీనివాసచారి అన్నారు. స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సోమవారం నిమ్మకూరు మాల్యాద్రి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఇంటింటికీ మెరుగైన వైద్యం


తూమాడు గ్రామంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రేష్మి

జరుగుమల్లి: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని కామేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రేష్మి పేర్కొన్నారు. తూమాడు గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమం నిర్వహించి 58 మంది రోగులను పరిక్షలు మందులు పంపిణీ చేశారు. ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

1,228 పొగాకు బేళ్ల కొనుగోలు


వేలంలో పాల్గొన్న బయ్యర్లు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి సోమవారం టంగుటూరు, జరుగుమల్లి, సాధువారిపాలెం, ఆలకూరపాడు, వావిలేటిపాడు, అనంతవరం, రావివారివారిపాలెం గ్రామాల రైతులు 1276 బేళ్లను వేలానికి ఉంచగా 1228 కొనుగోలయ్యాయి. గరిష్ట ధర రూ.276, కనిష్ట ధర రూ. 160, సరాసరి ధర రూ.263.78 పలికిందని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.